సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



నయనం ప్రధానం

విద్యార్థులు కంటి సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. 8లో ▸



తండ్రి కళ్లెదుటే..

రాయచూర్ నుంచి పెద్దంబర్‌పేట్‌కు ఉల్లిగడ్డ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి రేలింగ్‌ను ఢీ కొట్టడంతో కింద పడిపోయింది. 8లో ▸



ప్రసంగాలు.. పదనిసలు!

బీఆర్ఎస్ సభలో పలువురు నేతలు ఆసక్తికర ప్రసంగాలు చేశారు. కొందరు తడబడుతూ.. తప్పులు సరిచేసుకునే యత్నం చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

ఏడీఎఫ్ఓ రాజు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

షాద్‌నగర్: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఏడీఎఫ్ఓ రాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం షాద్‌నగర్ పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలంతా అప్రమత్తతో ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఏ చిన్న ప్రమాదం జరిగినా వెంటనే సమీపంలో ఉండే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి అగ్నిమాపక సిబ్బంది ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదానికి దారితీసిన ప్రహరీ నిర్మాణం



వివాదానికి కారణమైన ప్రహరీ నిర్మాణ పనులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలో ఆర్టీసీ అధికారులు చేపడుతున్న ప్రహరీ నిర్మాణం వివాదానికి దారితీసింది. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ పి.నర్సప్ప మాట్లాడుతూ.. సర్వే నంబర్ 279లోని ఆరు ఎకరాల భూమికి ఇటీవల కోర్టు నుంచి తమకు అనుకూలంగా ఆర్డర్ వచ్చిందని.. గతంలో ఉన్న అన్ని కేసులను కొట్టి వేస్తు కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 8న అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేసి ఆరు ఎకరాల భూమికి హద్దులు నిర్ణయించారని పేర్కొన్నారు. ఆ హద్దుల ప్రకారమే ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా కొందరు అడ్డుకుంటున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఈ భూమిని ఆర్టీసీ కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కొంతమంది అక్రమంగా లే అవుట్‌ను చేసి ప్లాట్లను విక్రయించారని ఆరోపించారు. దీనిపై ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ గతంలో రెవెన్యూ అధికారులు ఈ భూమికి ఎన్ఓసీలను జారీ చేశారని, మున్సిపల్ అధికారులు ఇంటి నిర్మాణ అనుమతులు కూడా మంజూరు చేశారని తెలిపారు. తాము కొనుగోలు చేసిన భూమిని ఆర్టీసీ స్వాధీనం చేసుకుంటే నష్టపోతామని వాపోయారు.

ప్రమాదకర బీజేపీని ఓడించాలి

సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రమాదకరమైన బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ పిలుపునిచ్చారు. శనివారం జరిగిన ఇబ్రహీంపట్నం మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కులం పేరుతో ఓట్లు అడుగుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని దుయ్యబట్టారు. మనువాదాన్ని ఓడించాలని, రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను విభజించి పాలిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 19న నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సీనియర్ నాయకుడు పి.జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు యాదయ్య, సామేలు, సీహెచ్ జంగయ్య, చెన్నమోని శంకర్, షఫీఉన్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



నూతనోత్తేజం

ఎన్నికల శంఖారావం పూరించిన బీఆర్ఎస్



కార్యకర్తల జోష్

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్టెప్పులు

- ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్
- తనమార్కు చలోక్తులతో ఆకట్టుకున్న కేసీఆర్
- ఉత్సాహపరిచిన ఎమ్మెల్యేలు, నేతలు
- పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని చేవెళ్ల గడ్డమీద నుంచి పూరించింది బీఆర్ఎస్. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం నిర్వహించిన ప్రజా ఆశ్వీర్వాద సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో పెద్ద సంఖ్యలో జనాలను తరలించారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తల్లో ఈ సభ ద్వారా కేసీఆర్ ఉత్తేజం నింపినట్లయింది. ర్యాంపుపై కేసీఆర్ నడుచుంటూ సభా వేదిక ముందుకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. తన ప్రసంగంలో ఆద్యంతం చలోక్తులతో ఆకట్టుకున్నారు. సభావేదికపై ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశ్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, కర్నె ప్రభాకర్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, కార్తీక్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, బాల్‌రాజ్, ప్రభాకర్, స్వప్న, దశరథ్, శ్రీశైలం తదితరులు ఆసీనులయ్యారు.

సభావేదికపై నేతల స్టెప్పులు

రసమయి బాలకిషన్ పాడిన గులాబీ జెండాలమ్మ పాటకు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి సభావేదికపై ముందుకు వచ్చి కండువాలు తిప్పుతూ.. స్టెప్పులు వేస్తూ ప్రజలను ఉత్తేజపరిచారు.

కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డ అంటేనే కేసీఆర్‌కు అడ్డా అని.. ఇక్కడ ఆయన నిలబెట్టిన వారిని గెలిపించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఈసారి కూడా బీఆర్ఎస్ ఎంపీ సీటును గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఒక బీసీ నాయకుడిగా బీసీ కులాలను ఏకం చేసేందుకు 93 కులాల ఐక్యవేదికను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశానన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితమైన వ్యక్తిగా అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అంతా కలిసి తనకు టికెట్ ఇప్పించారని.. తప్పకుండా చేవెళ్ల సీటును గెలిపించుకుంటామని కేసీఆర్‌కు భరోసా కల్పించారన్నారు. ఎంతోమంది తనకు మద్దతుగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందరి సహకారాలతో ఎంపీగా గెలిచి కేసీఆర్, ఈ ప్రాంత నాయకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని చెప్పారు.

అభివాదం చేస్తున్న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

అన్నీ తానై నడిపించిన సబితారెడ్డి

చేవెళ్ల గడ్డపై అన్నీ తానై ముందుండి ఏర్పాట్లు చూసుకున్న, నేతలను సమన్వయం చేసిన మాజీ మంత్రి సబితారెడ్డి సభా వేదికపై మాత్రం ప్రసంగించలేదు. కానీ మైకు పట్టుకొని సమయం దొరికనప్పుడల్లా జనానికి ఏదో ఒకటి చెబుతూనే ఇతర నాయకులకు అవకాశం కల్పించారు. కేసీఆర్ వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాలె యాదయ్యను మాట్లాడాలని చెబుతూ గులాబీ అధినేత కేసీఆర్ చేవెళ్ల గడ్డపైకి వస్తున్నాడని తెలియగానే ఆకాశంలో ఎండ పోయి మబ్బులు పట్టాయని.. అదే విజయమని పేర్కొన్నారు. చేవెళ్ల గడ్డపై మళ్లీ గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.



సభా వేదికపై పార్టీ నేతలు



కళాకారుల ఆటపాట

రూ.కోటి కారుకు నిప్పు

- కొనుగోలు ముసుగులో దురాగతం
- కాలి బూడిదైన 'లంబోర్గిని'
- డబ్బుల వివాదమే కారణమని అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మంటల్లో ఆహుతవుతున్న స్పోర్ట్స్ కారు



దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి

పహాడీషరీఫ్: కొనుగోలు ముసుగులో స్పోర్ట్స్ కారుకు నిప్పంటించిన సంఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో శనివారం సాయంత్రం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన నీరజ్ అనే వ్యాపారి తన లంబోర్గిని కారు (డీఎల్ 09 సివి 3636) అమ్మాలని నిర్ణయించుకొని పరిచయస్తుడైన అయాన్‌కు చెప్పాడు. దీంతో కస్టమర్ ఉంటే చూడాలంటూ అయాన్ తన స్నేహితుడైన మొఘల్‌పురాకు చెందిన అమన్ హైదర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కారు కొనేందుకు పార్టీ రెడీగా ఉందంటూ అమన్‌కు అతని మిత్రుడు అహ్మద్ తెలిపాడు. శనివారం సాయంత్రం 4 గంటలకు మామిడిపల్లిలోని ఫామ్‌హౌస్ వద్దకు కారు తీసుకురావాలని అహ్మద్ చెప్పడంతో, అయాన్ కారు తీసుకొచ్చి జల్‌పల్లి వద్ద అమన్‌కు ఇచ్చాడు. జల్‌పల్లి నుంచి అమన్ తన స్నేహితుడు హందాన్‌తో కలిసి కారు నడుపుకుంటూ అహ్మద్ చెప్పిన మామిడిపల్లి వివేకానంద చౌరస్తాను దాటి ఎయిర్‌పోర్ట్ రోడ్డు వైపు మళ్లి కారును ఆపారు. అనంతరం అహ్మద్, అతనితో పాటు మరికొంత మంది హోండా సిటీ, వ్యాగనార్ కార్లు, బైక్‌లపై అక్కడికి చేరుకున్నారు. నీరజ్ ఎక్కడ..? అతడు మాకు డబ్బులు ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరజ్‌ను పిలిపిస్తామని చెప్పినా వినకుండా అహ్మద్, అతని వెంట వచ్చిన వారు బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒక్కసారిగా లంబోర్గిని కారుపై పోసి నిప్పంటించారు. ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకునేలోపే కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్సై మధుసూదన్ ఘటనా స్థలానికి చేరుకొని కారును పరిశీలించారు. అమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కారు విలువ దాదాపు రూ.కోటి వరకు ఉండవచ్చని తెలిపారు.

ప్రభుత్వ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించిన సంఘం ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. స్పెషల్ విద్యావలంటీర్లను ఉపాధ్యాయులుగా గుర్తింపచేసిన ఘనత తమకే దక్కిందన్నారు. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం చేసినట్టు చెప్పారు. సీపీఎస్ అంతం అయ్యేవరకు ఉపాధ్యాయులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ప్రత్యేక అనుమతితో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల గాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, జిల్లా కార్యదర్శి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం


కిష్టు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పనికోసం వెళ్లిన ఆటో డ్రైవర్ ఇంటికి తిరిగి రాలేదు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బాలపూర్ మండలం , కుర్మల్‌గూడలో నివాసం ఉంటున్న జర్పుల కిష్టు ఆటో నడుపుకుంటూ జీవించేవాడు. రోజులాగే ఆటో తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కిష్టు భార్య విజయ ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రసంగాలు.. పదనిసలు!

చేవెళ్ల: బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పలువురు నేతలు ఆసక్తికర ప్రసంగాలు చేశారు. వీరిలో కొందరు తడబడుతూ.. తప్పులు మాట్లాడుతూ.. సరిచేసుకునే ప్రయత్నం చేశారు. ముందుగా మాట్లాడిన మండలి చైర్మన్ స్వామిగౌడ్.. ఎంపీ నియోజకవర్గం పరిధిలో 6లక్షల బీసీలు అన్నారు. ఇది గుర్తించిన కర్నె ప్రభాకర్ 6లక్షలు కాదు 16లక్షల బీసీలు అని చెప్పటంతో సరి చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, పలువురు నాయకులు మాట్లాడుతూ.. పదేపదే కేసీఆర్‌ను ముఖ్యమంత్రి అంటూ సంబోధించారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. చీము, నెత్తురు ఉంటే బీసీలు చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌ను గెలిపించాలని అని తడబడ్డారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్నం కుటుంబ పార్టీ మారడంతో దరిద్రం పోయినట్లు ఉందన్నారు. మాజీ మంత్రి సబితా రెడ్డి వద్దని వారిస్తున్నా విమర్శలను కొనసాగించారు.



సత్తా చాటాలి



దేశంలోని 543 ఎంపీ స్థానాల్లో బీసీలు కేవలం 80 మంది మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చేవెళ్ల గడ్డపై గెలిచేందుకు కేసీఆర్ ఒక నేతకు అవకాశం కల్పించడం గొప్ప విషయం. దీన్ని సద్వినియోగం చేసుకుని బీసీల సత్తాచాటాలి. పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి కాసానిని గెలిపించాలి.

– స్వామిగౌడ్, మండలి మాజీ చైర్మన్

కాసానిని గెలిపిస్తాం

బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి తీరుతాం. బీసీ సంఘాల మద్దతు కాసానికి ఉంటుంది. గతంలో కేసీఆర్ ద్వారా లబ్ధి పొంది ప్రజాప్రతినిధులుగా ఎదిగిన చాలా మంది నాయకులు పదవులు అనుభవించి వెళ్లిపోయారు. కాసాని అలాంటి వ్యక్తి కాదు.. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడే మనిషి.

– యెగ్గె మల్లేశ్, ఎమ్మెల్సీ

అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే



తెలంగాణ రాక ముందు 60 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కేసీఆర్ పదేళ్లలో చేసి చూపించారు. చేవెళ్ల ప్రాంతంలోని ఈసీ, మూసీ నదులపై పది బ్రిడ్జిలు నిర్మించారు. జీఓ 111ను తొలగించి ప్రజలకు మేలు చేశారు. కేసీఆర్ పాలనలో కరెంటు, నీళ్ల ఎలా ఉండేవో..? ఎప్పుడెలా ఉన్నాయో అందరూ గమనించాలి.

– కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

బీసీలు సత్తా చాటాల్సిన సమయం



బీఆర్‌ఎస్‌ను వీడే నాయకులతో పార్టీకి ఎలాంటి నష్టం లేదు. కొత్త నాయకులను తయారు చేసుకునే సత్తా పార్టీకి, కేసీఆర్‌కు ఉంది. పట్నం కుటుంబం పార్టీని వీడటంతో దరిద్రం పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగు, సాగునీటి సంక్షోభం తీసుకురానుంది. బీసీల సత్తా చాటే సమయం వచ్చింది.

– రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

వ్యక్తిపై దాడి.. విరిగిన కాలు

ఇబ్రహీంపట్నం రూరల్: మేడపై నిద్రిస్తుండగా బట్టలు ఆరవేసిన నీరు పైన పడుతున్నాయని అడిగినందుకు ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, దాబా పైనుంచి తోయడంతోకిందపడిపోయాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రాజన్ అనే వ్యక్తి టైల్స్‌వర్క్ చేసుకొని జీవిస్తుండేవారు. రాత్రి డాబా మీద పడుకున్నాడు. అదే పోర్షన్‌లో ఉండే అంకుష్, రమేష్‌లు ఇద్దరు బట్టలు ఆరవేశారు. నీళ్ల పడుతున్నాయని రాజన్ అన్నందుకు ఇద్దరు దాడి చేసి నెట్టడంతో రాజన్ భవనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో ఎడమకాలు విరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

20 నుంచి హెచ్‌సీఏ వేసవి శిక్షణా శిబిరాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. నగరంలోని ఐదు కేంద్రాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేశామని, ఇందులో చిన్నారులకు నెల రోజులపాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు తెలిపారు. ప్రతి శిబిరంలో 80 నుంచి 100 మందికి అవకాశమిస్తామని... బాలురకు అండర్-14, అండర్-16, అండర్-19 వయో విభాగాల్లో... బాలికలకు అండర్-15, అండర్-19 వయో విభాగాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని జగన్ మోహన్ రావు వివరించారు. ఆసక్తి గలవారు ఈనెల 15 నుంచి 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని ఐదు కేంద్రాల్లో (జింఖానా; మొబైల్: 90301 30346, ఫలక్‌నామా: 98852 95387; అంబర్‌పేట: 98665 82836; లాలాపేట: 99664 62667; మాదాపూర్: 80195 35679) శిబిరాలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్ (http://www.hycricket.orf)ను సందర్శించి, తెలుసుకోవచ్చు.

యువకుడి ఆత్మహత్య


సందీప్ మృతదేహం

పహాడీషరీఫ్: ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాంకాలనీకి చెందిన డి.సందీప్(30), విజయలక్ష్మి దంపతులకు మూడేళ్ల క్రితం వివాహం జరగగా మూడు నెలల క్రితం బాబు జన్మించాడు. పెళ్లయిన కొత్తలో వీరి దాంపత్య జీవితం సాఫీగానే సాగగా, ఏడాదిన్నర కాలంగా మద్యానికి బానిసైన సందీప్ తరచూ భార్యతో గొడవలు పడేవాడు. మూడు నెలలుగా ఉప్పల్‌లోని పుట్టింటిలో విజయలక్ష్మి ఉంటుంది. సందీప్ నిత్యం ఫోన్ చేసి తన కుమారుడి విషయం అడుగుతుండేవాడు. కాగా, శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన సందీప్ ఉదయం నిద్ర లేవలేదు. కుటుంబ సభ్యులు తలుపులు తట్టి చూడగా ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకొని కనిపించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


విజయ్ జైస్వాల్

పహాడీషరీఫ్: గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విజయ్ జైస్వాల్(34) షాజహాన్ కాలనీలో బీప్ స్టోరేజీలో పని చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో దూల్‌పేటలో గంజాయి కొనుగోలు చేశాడు. షాహీన్‌నగర్‌లోని మదీనా హిల్స్‌లో విక్రయించేందుకు యత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు బాలాపూర్ ఎస్సై మహేందర్, మహేశ్వరం జోన్ స్పెషల్ టీంతో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, రూ.1500ల నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం


మగబిడ్డకు జన్మనిచ్చిన శివరాణి

కడ్తాల్: మండలంలోని ముద్వీన్ గ్రామానికి చెందిన శివరాణిని రెండవ కాన్పు నిమిత్తం భర్త సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌లోని కోఠి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయగా, శుక్రవారం రాత్రి ఆమెను 108 వాహనంలో హైదరాబాద్ తరలిస్తుండగా, మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమవ్వడంతో, వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపి 108 సిబ్బంది సాధారణ డెలివరీ చేశారు. శివరాణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా 108 పైలట్ మణిపాల్, అంబులెన్స్ ఈఎంటీ కల్యాణ్‌ను శివరాణి దంపతులతో పాటు, కుటుంబ సభ్యులు అభినందించారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థులు కంటి సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం షాద్‌నగర్ పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కమ్మదనంలోని బాలికల గురుకుల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు కంటి వైద్య నిపుణుడు శ్రీహరి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడారు. శరీరంలో కళ్లు ఎంతో సున్నితమైనవని అన్నారు. విద్యార్థులు దృష్టిలోపం రాకుండా విటమిన్ ఏ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తినాలని సూచించారు.క్యారెట్లు, ఆకుకూరలు, ఉడకబెట్టిన గుడ్లు, పాలు తాగాలన్నారు. అలాగే, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణించగలుగుతారని అన్నారు. 253 మంది విద్యార్థినిలకు పరీక్షలు నిర్వహించగా 17 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి, షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది అన్నపూర్ణ, సునీత, హేమలత, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మల్లురవి

మాడ్గుల: మాజీ పీఏసీఎస్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొజ్జ మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి శనివారం ఆయన మృతిదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జీవితాంతం కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో నాగర్ కర్నూల్ జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ నాయకులు సూదిని రాంరెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, బట్టు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ కంపెనీకి కుచ్చుటోపీ

- నకిలీ బంగారం తాకట్టు
- రూ.28 లక్షల లోన్ తీసుకున్న దుండగులు

ఇబ్రహీంపట్నం : నకిలీ బంగారం కుదవపెట్టి ఓ మైక్రో ఫైనాన్స్ కంపెనీకి కుచ్చుటోపీ పెట్టిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో పూజారీ శ్రీనివాసులు, గుడ్డిమల్ల మహేశ్, షేక్ రహీంపాషా అనే ముగ్గురు వ్యక్తులు 2023 జూలైలో వేర్వేరుగా నకిలీ బంగారం అభరణాలు తాకట్టు పెట్టి వాటిపై రూ.28.82.788 లక్షలు రుణం తీసుకున్నారు. గత అకౌంట్స్‌కు ఈ నెల 2న అధికారులు వచ్చి ఆడిట్ చేశారు. దీంతో రూ.28.82.788 లక్షలకు సంబంధించిన బంగారం లాకర్ తెరిచి చూసి పరిశీలించారు. ఇందులో అన్ని బంగారు నగలు ఫేక్ అని తేలింది. దీంతో మేనేజర్ దుర్ధకుంట గొల్ల చంద్రప్ప ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

తండ్రి కళ్లెదుటే కొడుకు దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు


పల్టీ కొట్టిన లారీ


మృతి చెందిన సమ్రాత్


గాయపడిన అంబాజీ

ఇబ్రహీంపట్నం రూరల్: కర్నాటక రాష్ట్రం రాయచూర్ నుంచి పెద్దంబర్‌పేట్‌కు ఉల్లిగడ్డ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి ఔటర్ రెలింగ్‌ను ఢీ కొట్టడంతో కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన అంబాజీ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. విఠల్ అనే వ్యక్తి లారీలోడ్ ఖాళీ చేయడానికి హైదరాబాద్‌కు వస్తావాని అడగడంతో సరేనని వచ్చాడు. అతనితో పాటు కుమారుడు సమ్రాత్ కూడా తండ్రి వెంట అదే లారీలో వచ్చాడు. ఔటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల సమీపంలోని ఎగ్జిట్ 15 వద్దకు రాగానే డ్రైవర్ ఆ జాగ్రత్త వల్ల లారీ కిందపడింది. రెయిలింగ్‌కు తగలడంతో లారీలో ఉన్న ముగ్గురు అంబాజీ(40), డ్రైవర్ విఠల్(30)లకు కాళ్ళు చేతులు విరిగాయి. అంబాజీ కుమారుడు సమ్రాత్ (13)కు తలకు బలమైన గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. క్షతగాత్రులు ఇద్దరు అన్నదమ్ములే. వీరిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

నవసమాజానికి మహిళలు దిక్సూచి


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, వెల్‌స్పన్ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: రేపటి తరానికి స్ఫూర్తి ఇచ్చేలా సామాజిక చైతన్యం తీసుకురావడంలో మహిళలు ముందుండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెల్ స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హయతాబాద్‌లో 'అభివృద్ధి దిశగా కమ్యూనిటీల బలోపేతం' అనే నినాదంతో ఓ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు విజయవంతమైన మహిళల జీవిత విశేషాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చందనవెల్లి, మద్దూరు, సోలీపేట్, మాచన్‌పల్లి తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.